ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
మంగళవారం 10 సెప్టెంబరు 2024

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

» ప్రజావాణిలో డీఆర్వో సంగీత

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని డీఆర్వో సంగీత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె 70 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఆమె తెలిపారు.



గోనె సంచులతో

గణపయ్య

తాండూరు, సెప్టెంబర్ 9: వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన మైక్రో ఆర్టిస్టు బిరకట్ మధుసూదన్ గోనె సంచులతో శివ తాండవం చేస్తున్న వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశారు. దీన్ని కాళికాదేవి ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించారు. మధుసూదన్ గతంలో న్యూస్‌పేపర్, టిష్యూ పేపర్, బుట్టలు, వరిగడ్డి, గోధుమ గింజలతో వివిధ రూపాల్లో లంబోదరులను తయారు చేశారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

డీసీసీబీ వైస్ చైర్మన్‌గా సంగెం రవీందర్‌గౌడ్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9: డీసీసీబీ వైస్ చైర్మన్‌గా సంగెం రవీందర్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాంపల్లిలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన ఎన్నికలో పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా ఉన్న బి.మనోహర్‌రెడ్డి శాసనసభ ఎన్నికల ముందు రాజీనామా చేశారు. ఆయన తాండూరు శాసనసభ స్థానానికి పోటీ చేసి విజయం సాధించాడు. వైస్ చైర్మన్‌గా ఉన్న కొత్త కుర్మ సత్తయ్యను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. దీంతో వైస్ చైర్మన్ పోస్టు తొమ్మిది నెలలుగా ఖాళీగా ఉంది. ఎట్టకేలకు సోమవారం వైస్ చైర్మన్ ఎన్నికను పూర్తి చేశారు. తాండూరు మండలం ఎలిమకన్య పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్న సంగెం రవీందర్‌గౌడ్ డీసీసీబీలో డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. కొత్తగా వైఎస్ చైర్మన్‌గా ఎన్నికైన సంగెం రవీందర్‌గౌడ్‌ను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అంజిరెడ్డి, చంద్రశేఖర్, బాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పోలీస్ రాంరెడ్డి, బూరుకుంట సతీష్, చంద్రశేఖర్, రాణి, గోగులోతు సైదా, డీసీసీబీ అధికారులు పాల్గొన్నారు.

ధనుశ్ శ్రీకాంత్‌కు ఘన స్వాగతం

» వరల్డ్‌డీఫ్ షూటింగ్‌లో మూడు స్వర్ణాలు సొంతం



శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 9: హానోవర్‌లో జరిగిన వరల్డ్ డీఫ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటి మూడు స్వర్ణ పతకాలు సాధించిన మన తెలుగు తేజం ధనుశ్ శ్రీకాంత్‌కు సోమవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గన్ ఫర్ గ్లోరి షూటింగ్ ఆకాడమీ క్రీడాకారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులు మాట్లాడుతూ... రాష్ట్రం తరుపున మూడు బంగారు పతకాలు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కోచ్ ప్రోత్సాహంతోనే శ్రీకాంత్ మూడు బంగారు పతకాలు సాధించారన్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తాడని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి నగరానికి బయలు దేరి వెళ్లారు.



అలుగు నాలాకు ఆనుకొని నిర్మించిన భవనాలు

సువిశాలమైన మేడ్చల్ పెద్ద చెరువు నేడు కబ్జా కోరల్లో చిక్కుకుంది. రియల్టర్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో దర్జాగా కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. భారీ వెంచర్లు సైతం ఏర్పాటు చేసి ప్లాట్లుగా చేశారు. ప్రస్తుతం చెరువు పూర్తిగా నిండటంతో బఫర్‌జోన్‌లోని రోడ్లు, ప్లాట్లు నీటమునిగాయి. చెరువు ఉనికిని దెబ్బతీస్తున్న భూబకాసురులపై ఎటువంటి చర్యలూ లేకపోవడంతో ఈ ఆక్రమణలకు అడ్డే లేకుండా పోయింది. మరోవైపు చెరువుల రక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా కొరడా ఝుళిపిస్తుండటంతో మేడ్చల్ చెరువు పరిధిలోని కబ్జాలపై చర్యలకు స్థానికులు ఎదురుచూస్తున్నారు.

పెద్దచెరువు అన్యాక్రాంతం!

కబ్జాకోరల్లో మేడ్చల్ పెద్దచెరువు

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో

భారీగా వెంచర్లు, నిర్మాణాలు

ప్రస్తుతం చెరువు నిండటంతో మునిగిన రోడ్లు

మాయమైన కాలువలు, అలుగు, నాలా

పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

కబ్జాల పర్వం 10

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 9 : మేడ్చల్ పెద్ద చెరువు ఎల్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో పూర్తి స్థాయిలో కబ్జాకోరల్లో చిక్కుకుంది. ఇరిగేషన్ అధికారులు 2013లో చెరువు సర్వే నిర్వహించి అందుకు సంబంధించిన ప్లాన్‌ను హెచ్ఎండీఏ అధికారులకు నివేదించారు. 356 ఎకరాల్లో పెద్ద చెరువు విస్తీర్ణం ఉన్నట్లు నిర్ధారించారు. ఈ విస్తీర్ణంలో చెరువు శిఖంతో పాటు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల గురించి పూర్తి వివరాలు తెలియజేశారు. అయినా అధికారుల అలసత్వం, రాజకీయ పలుకుబడితో చెరువు పరిధిలో పెద్ద సంఖ్యలో నిర్మాణాలు, లేఅవుట్‌లు వెలిశాయి. గతంలో ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించి చెరువు సరిహద్దులను గుర్తించి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. కాగా రియల్టర్లు వాటిని తొలగించి ప్లాట్లుగా మార్చేసి విక్రయించారు.

విచ్చలవిడిగా ప్లాట్లు, విల్లాల నిర్మాణాలు

దక్షిణ భాగాన ఉన్న బఫర్ జోన్‌లో మూడు వెంచర్లు ఏర్పాటు చేశారు. ఒక దానిలో ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రెండు వెంచర్లలో రోడ్లు వేసి నిర్మాణాలను ప్రారంభించారు. వెంచర్ ముందు భాగంలో అంతా సవ్యంగా ఉన్నట్లు కనబడుతున్నప్పటికీ వెనుక చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో రోడ్లు, భవనాలు నిర్మించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుతారిగూడలోని ఓ ఎన్‌క్లేవ్‌లో దాదాపు 6 ఎకరాల వరకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌కు సంబంధించిన విస్తీర్ణంలో ప్లాట్లు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం చెరువు నిండటంతో ఈ వెంచర్ వెనుక భాగంలోని చాలా ప్లాట్లు, రోడ్లు పూర్తిగా నీట మునిగి

మిగతా 7వ పేజీలో...



అధికారులు వేసిన మార్కింగ్

హిమాయత్‌సాగర్‌లో 'హైడ్రా' సర్వే

» ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధి నిర్ధారణ

» స్వతహాగా కూల్చివేస్తున్న పలువురు నేతలు

మొయినాబాద్ : హైడ్రా పేరు వింటేనే చెరువు, కుంటల పరీవాహక ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టిన వారి గుండెల్లో గుబులు మొదలవుతుంది. గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన హైడ్రా అధికారులు ప్రస్తుతం హిమాయత్ సాగర్ పరీవాహక ప్రాంతంపై దృష్టి సారించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలు పరిశీలిస్తున్నారు. సంబంధిత అధికారులతో కలిసి రహస్యంగా సర్వేలు చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిని గుర్తించి మార్కింగ్ చేస్తున్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ రెవెన్యూ పరిధిలో ఇప్పటికే అధికారులు సర్వేలు చేసి హద్దులు నిర్ణయించారు.

అధికారులు కూల్చివేయక ముందే..

హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో ఫాంహౌస్‌లు ఉన్న కొంత మంది ప్రముఖులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలను అధికారులు కూల్చకముందే వారే తొలగించుకుంటున్నారు. బఫర్‌జోన్ పరిధిలోని ప్రహరీ, షెడ్లు తొలగించి ఫెన్సింగ్ వేసుకుంటున్నారు. అధికారులు కూల్చితే మీడియాలో ప్రచారం జరిగి అందరికీ తెలుస్తుందని ఇదంతా జరగకముందే స్వతహాగా కూల్చివేతలను ప్రారంభించారు. ఏపీకి చెందిన ఓ నేత ప్రహరీ బఫర్ జోన్‌లో ఉందని తెలియడంతో ముందుగానే తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారు. తొలగించిన శిథిలాలు కూడా అక్కడ లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ఓ మాజీ మంత్రి సైతం ప్రహరీని తొలగించి ఫెన్సింగ్ మాత్రం ఉంచారు. ఇక పరీవాహక ప్రాంతంలో కొందరు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని సూచించే హద్దురాళ్లు సైతం తొలగించినట్లు అధికారుల సర్వేలో తేలినట్లు తెలిసింది. కొందరు ప్రహరీ కోసం ఆక్రమిస్తే మరికొందరు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి నింపి వినియోగించుకుంటున్నారు.

» అధికారులను ప్రశ్నించిన లోకాయుక్త విచారణ అధికారి

» తుమ్మలకుంట పరిశీలన

ఆక్రమణలు జరుగుతుంటే ఏం చేస్తున్నారు?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహేశ్వరం: ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతుంటే వాటిని పరిరక్షించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏం చేస్తున్నారని లోకాయుక్త విచారణ అధికారి మ్యాథ్యూకౌశి మండిపడ్డారు. 'తుమ్మలకుంటను మింగిన వెంచర్' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన లోకాయుక్త, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తుమ్మల కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మంఖాల్ సర్వే నంబర్ 131 లోని ప్రభుత్వ భూమి నుంచి ఓ ప్రైవేటు వెంచర్‌కు రోడ్డు ఎలా వేశారని, అదే విధంగా తుమ్మల కుంటనుంచి నీరు బయటకు వెళ్లకుండా ఉన్న దారులన్నింటినీ ఏ విధంగా మూసి వేశారనే అంశాలపై తగిన వివరణ ఇవ్వాలని తహసీల్దార్ సైదులు, ఇరిగేషన్ డీఈఈ దుద్యానాయక్‌ను ప్రశ్నించారు. వీలైనంత త్వరలో ప్రభుత్వ భూమినుంచి ప్రైవేటు వెంచర్‌కు రోడ్డు ఎలా వేశారో వివరాలను వెంటనే సమర్పించాలన్నారు. అదే విధంగా రోడ్డును ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఆ రోడ్డును మూసివేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూమిలో రోడ్డు వేయడంపై సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు తమకు ఫిర్యాదు కూడా చేశారని విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అదే విధంగా తుమ్మలకుంటను పూర్తిగా సర్వే చేసి హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ రాకేష్‌గౌడ్, తుక్కుగూడ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌తో పాటు పలువురు రైతులు ఉన్నారు.



తుమ్మల కుంటను పరిశీలిస్తున్న అధికారులు

పేద రైతుల పొట్టగొట్టి బినామీల పేర్లతో రూ.10 కోట్ల పరిహారాన్ని దిగమింగారు. అసైన్డ్ భూములకు బినామీలను సృష్టించి అప్పనంగా పరిహారాన్ని కాజేశారు. కొత్తూర్ మండల పరిధిలోని సిద్దాపూర్ అసైన్డ్ భూ బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఈ తతంగంలో గత ప్రభుత్వ పెద్దల హస్తంతో పాటు ఆ గ్రామానికి చెందిన కొందరు బీఆర్ఎస్ నాయకులు, రెవెన్యూ అధికారుల ప్రమేయం కూడా ఉన్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.



సిద్దాపూర్‌లో రైతులకు అసైన్ చేసిన భూమి

రూ.10కోట్లు దోచేశారు!

సిద్దాపూర్‌లో భారీ కుంభకోణం

» బినామీ పేర్లతో అసైన్డ్ భూములకు పరిహారం
» ఆహార శుద్ధి పరిశ్రమకు 330 ఎకరాల భూసేకరణ
» 100 ఎకరాలకు తప్పుడు పత్రాల సృష్టి
» బీఆర్ఎస్ నాయకులు, అధికారుదే పాత్ర
» విచారణకు ఆదేశించిన మంత్రి పొంగులేటి
» పలువురు బినామీలకు అధికారుల నోటీసులు

షాద్‌నగర్/కొత్తూర్, సెప్టెంబరు 9: సిద్దాపూర్ ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 278, 252, 361 లలో దాదాపు 330 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 160 ఎకరాలను భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుపేదలు 80 మందికి చాలా ఏళ్ల కిందటే అసైన్ చేసి పట్టాలు అందజేశారు. వారు ఆ భూములు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. మరో 170 ఎకరాల్లో నిరుపేద రైతులు పట్టాలు లేకుండా సాగు చేస్తూ జీవనం పొందుతున్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్దాపూర్‌లోని అసైన్డ్ భూమిని గుర్తించి, అక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఆ బాధ్యతను టీఎస్ఐఐసీకి అప్పగించింది. ఆ సంస్థ అసైన్డ్ భూములను సేకరించింది. ఎకరాకు రూ.10 లక్షల పరిహారం చెల్లించేందుకు రైతులతో ఒప్పందం చేసుకుంది. మొత్తం 330 ఎకరాలకు 160 ఎకరాల్లోని అర్హులైన 80 మంది రైతులకు పరిహారం ఎలాంటి ఆటంకాలు లేకుండా అందజేశారు. మరో 70 ఎకరాల్లో గుట్టలు ఉన్నాయి. ఇది పోను మరో 100 ఎకరాల్లో భూ కుంభకోణం జరిగినట్లు సమాచారం.

74 మంది బినామీల సృష్టి

ఈ భూములకు సంబంధించి పేద రైతులకు పట్టాలు లేకపోవడాన్ని అవకాశంగా తీసుకున్నారు. 4 ఎకరాలున్న రైతులకు ఎకరాకు మాత్రమే పరిహారం చెల్లించారు. మరికొందరు అర్హులైన రైతులకు అసలు పరిహారమే దక్కలేదు. మరోవైపు, 74 మంది బినామీలను సృష్టించి.. వారి పేరిట వచ్చిన పరిహారాన్ని అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు కాజేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిద్దాపూర్‌కు చెందిన తాజా మాజీ ప్రజాప్రతినిధి ఒకరు అధికారుల అండతో ఏకంగా 8 ఎకరాలకు తన పేరును రికార్డుల్లోకి ఎక్కించుకుని పరిహారం కాజేశారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి అర్హులైన పేద రైతులకు న్యాయం చేయాలని కోరారు. మంత్రి ఆదేశాలపై ఇటీవల షాద్‌నగర్ ఆర్డీవో సిద్దాపూర్ గ్రామంలో అసైన్డ్ భూముల రైతులతో సమావేశమై పరిహారంపై వివరాలు సేకరించారు. పలువురు బినామీలకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. దాంతో అవినీతి, అక్రమాలకు పాల్పడిన నేతలు, అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి.

పరిహారం అందలేదు



మాకు 5 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఇప్పటి వరకు ఎకరాకు కూడా పరిహారం అందలేదు. వ్యవసాయం చేస్తూ ఆ భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ఎలాంటి ఫలితం లేదు.

\- బైండ్ల చెన్నయ్య, రైతు, సిద్దాపూర్

ఎకరాకు మాత్రమే చెల్లించారు



ప్రభుత్వం మా కుటుంబానికి 5 ఎకరాల భూమిని అసైన్ చేసింది. ఐదెకరాలు స్వాధీనం చేసుకున్నా ఒక ఎకరాకే పరిహారం చెల్లించారు.

-పట్నం సుజాత, రైతు, సిద్దాపూర్

అసలైన రైతులకు అన్యాయం



భూమి లేని వారి పేర్లను రికార్డుల్లో చేర్చి కోట్ల రూపాయలు కాజేశారు. ప్రభుత్వం విచారణ జరిపి అసలైన రైతులకు న్యాయం చేయాలి. పరిహారం చెల్లించకపోతే మా భూమిని అప్పగించం

\- పాత్లావత్ శంకర్, రైతు, పులిచర్లకుంట తండా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



కరుణాకర్(ఫైల్)



శేఖర్(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబరు 9: రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పరిగి రోడ్డు ఎలికట్ట శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొందుర్గు మండలం పులుసుమామిడి గ్రామానికి చెందిన రెడ్డి శేఖర్(25), అదే మండలం రేగడి చిల్కమర్రి గ్రామానికి చెందిన కరుణాకర్(20) మోటార్ సైకిల్‌పై షాద్‌నగర్ నుంచి రేగడి చిల్కమర్రి గ్రామానికి వెళ్తున్నారు. సోమవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఎలికట్ట చౌరస్తాలో నిలిపి ఉన్న లారీని వారి బైకు ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. శేఖర్ ప్రైవేట్ బస్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, కరుణాకర్ షాద్‌నగర్‌లోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. కరుణాకర్ తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?



నిరసన వ్యక్తం చేస్తున్న చిలుకూరు గ్రామస్తులు

మొయినాబాద్, సెప్టెంబరు 9: మండలంలోని చిలుకూరు - మొయినాబాద్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయినా పనులు చేయడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా గుంతలమయమై రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ మేరకు చిలుకూరు గ్రామస్తులు సోమవారం రోడ్డుపై ఫ్లెక్సీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం చిలుకూరు నుంచి మొయినాబాద్ వరకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరభద్రస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ హక్కుల సాధనకు కలిసి రావాలి



రమేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న కటికల శ్రీహరి

కందుకూరు, సెప్టెంబరు 9 : బీసీల హక్కుల సాధనకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని, కుల గణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని సమాజ్ వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఇన్‌చార్జి కటికల శ్రీహరి డిమాండ్ చేశారు. సోమవారం బీసీ సంఘం నేతలు, ఎస్పీ నేతలతో కలిసి కందుకూరులోని సీతా రామశాస్త్రి కల్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యమొచ్చి 78సంవత్సరాలు గడుస్తున్నా బీసీలు అభివృద్ధి చెందలేదన్నారు. ప్రధానమంత్రిగా బీసీ నేత నరేంద్రమోదీ ఉన్నా బీసీలకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి డిక్లరేషన్ మేరకు కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కులగణన చేసి ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు వెంకటేష్, ఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కోటేశ్వర్, ఎస్పీ కందుకూరు, మహేశ్వరం మండలాల అధ్యక్షులు రమేష్, కాకి అజయ్, అల్లె నర్సింహ, అంజయ్య, డి.యాదగిరి, ఎం.సాయిబాబ పాల్గొన్నారు. కాగా దెబ్బడగూడకు చెందిన పొడిపాల రమేష్‌ను ఎస్పీ మండల శాఖ అధ్యక్షుడిగా నియమించినట్లు శ్రీహరి, కోటేశ్వర్‌లు తెలిపారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతల్లో ఉన్న తేరటి అంజయ్యకు జిల్లా బాధ్యతలు అప్పగించారు.



16వ ఆర్థిక సంఘం సమావేశంలో విశాలశ్రవణ్‌రెడ్డి, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

పంచాయతీలకు అధిక నిధులివ్వాలి

కేశంపేట/కడ్తాల్, సెప్టెంబరు 9: 16వ ఆర్థిక సంఘం రాష్ట్ర పర్యటనలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనాగరియ అధ్యక్షతన స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, కడ్తాల మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్, అధికారులు స్థానిక సంస్థల సభ్యుల సలహాలు తీసుకున్నారు. పంచాయతీలు, పరిషత్‌లకు ఎక్కువ నిధులు, అధికారులివ్వాలని కోరారు. ఆయా సంస్థలకే నిధులు నేరుగా కేటాయిస్తే అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. 16వ ఆర్థిక సంఘంలో చేర్చాల్సిన అంశాలను వివరించినట్లు సభ్యులు తెలిపారు. స్థానిక సంస్థల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని కోరినట్లు ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. సమావేశంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితరామచంద్రన్, ఫైనాన్స్ కమిషనర్ రామకృష్ణారావు, రంగారెడ్డి జిల్లా నుంచి మాజీ ఎంపీపీ పద్మారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కిరణ్‌కుమార్‌గౌడ్, సురేందర్ పాల్గొన్నారు.

రైతులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలి



మార్కెట్ యార్డులో జెండాను ఆవిష్కరిస్తున్న కిసాన్ సంఘ్ నాయకులు

చేవెళ్ల, సెప్టెంబరు 9 : రాజకీయ పార్టీలు వేరైనా రైతులంతా సంఘటితంగా ముందుకు సాగాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి పెంటారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం చేవెళ్లలోని మార్కెట్ యార్డులో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశాన్ని నిర్వహించారు. అలాగే బలరాం భగవాన్ జన్మదినం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ... వ్యవసాయానికి మూల పురుషుడు బలరాముడన్నారు. ఆయనను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు లక్ష్మారెడ్డి, ఈశ్వరప్ప, రమణారెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజేంద్రప్రసాద్, విశ్వనాథ్, వీరేశం, రఘుపతిరెడ్డి, అంజిరెడ్డి, ఇతర రైతులు పాల్గొన్నారు.

ఓటు.. నమోదు చేసుకోండి



- మార్పులు, చేర్పులకు అవకాశం
- ఓటర్ల జాబితా సవరణకు శ్రీకారం
- ఇంటింటా సర్వేలో బీఎల్వోలు
- యాప్‌లో వివరాల నమోదు
- ఈనెల 18వ వరకు గడువు

తాండూరు, సెప్టెంబర్ 8: ఓటర్ల నమోదుపై ఎన్నికల సంఘం మరోసారి దృష్టి సారించింది. ప్రతీయేటా చేపట్టే తరహాలోనే ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బూత్‌స్థాయి అధికారులు (బీఎల్వోలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి కొత్తగా ఓటు హక్కు పొందేవారి వివరాల నమోదుతో పాటు మృతులు, శాశ్వత వలస ఓటర్లు, పెళ్లైన వారి ఓటర్ల తొలగింపు, సవరణల నిమిత్తం దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో తహసీల్దార్లు పర్యవేక్షిస్తారు. ఇందుకు సంబంధించి బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. కాగా, 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు.

యాప్‌లో వివరాల నమోదు

2025 జనవరి 1 తేది నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అర్హులు. ఈ మేరకు చేర్పుల నిమిత్తం కుటుంబంలో ఎవరైనా ఉన్నారా? అనే వివరాలపై బీఎల్వోలు సర్వే చేపట్టారు. ఇందుకు సంబంధించి ఈనెల 18వరకు గడువు ఉంది. ఈ యాప్‌లో పోలింగ్ కేంద్రానికి సంబంధించి విద్యుత్, తాగునీరు, ర్యాంప్‌లు, మురుగు దొడ్ల వంటి మౌలిక వసతులు ఉన్నాయా? లేదా అనే అంశాలను నమోదు చేస్తారు.

బీఎల్వోలకు ప్రత్యేక రిజిష్టర్లు

ప్రతీ బూత్‌కు సంబంధించి బీఎల్వోలకు ఈసారి ప్రత్యేకంగా తయారు చేసిన రిజిష్టర్లను అందజేశారు. దానిలో పోలింగ్ బూత్‌లతో పాటు పూర్తి వివరాలను పొందపర్చారు. స్టేట్‌మెంట్-1లో స్టాటిస్టికల్ ఇన్ఫర్మేషన్ పొందుపర్చారు. వయస్సు వారీగా ఓటర్ల సంఖ్యను పొందుపర్చారు. 18-19 సంవత్సరాలు, 20-29, 30-39, 40-49, 50-59, 60-69 సంవత్సరాల వారీగా ఓటర్ల సంఖ్యను పేర్కొన్నారు.

స్టేట్‌మెంట్-2లో..

18 రకాల కాలమ్స్ ద్వారా ఓటరు పూర్తి సమచారాన్ని ఇందులో కోరారు. ఫొటో ఓటర్‌దేనా, ఎంపిక నెంబర్, పుట్టిన తేదీ, ఇంటి నంబర్, ఇంటి పేరు, పేరు, బంధుత్వం, వయస్సు, టెలిఫోన్ లేదా మొబైల్ నంబర్, ఆధార్ నెంబర్, మెయిల్ ఐడీ, ఫొటో మార్పులు ఉంటే వివరాలు, చనిపోయారా, వలసనా, రిపీటెడ్, ఎన్ని ఏళ్లుగా నివసిస్తున్నారు వంటి తదితర వివరాలను బీఎల్వోలు రిజిష్టర్‌లో నమోదు చేస్తారు. ప్రస్తుతం తుది జాబితాలో ఉన్న ఓటర్ల వివరాల ప్రకారం బీఎల్వోలు సర్వే నిర్వహిస్తారు. జాబితాలో ఉన్న చిరునామాలోనే ఓటర్ ఉంటున్నారా? లేక మార్పులు ఏమైనా చేయాలా వంటి పలు రకాల అంశాలపై బీఎల్వోలు క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్నారు.

ఫారాల రకాలు

దరఖాస్తుకు ఫారం -6, సవరణకు-7, చిరునామా బదిలీకి-8 వంటివి ఉపయోగించుకోవచ్చు. కాగా, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోను దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

ముఖ్యమైన తేదీల వివరాలు	
సర్వే ఎప్పటి వరకు	అక్టోబరు 18
ముసాయిదా జాబితా	అక్టోబరు 29
అభ్యంతరాల స్వీకరణ	డిసెంబరు 24
తుది జాబితా ప్రచురణ	6 జనవరి 2025

ఓటర్ల వివరాలు

మండలం, మున్సిపాలిటీ	పురుషులు	మహిళలు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
పెద్దేముల్	19228	20279	39507	46
కోట్‌పల్లి	3167	3353	6520	08
యాలాల	19504	21389	40893	48
బషీరాబాద్	19014	20903	39917	47
తాండూరు	56996	59492	11488	120
మొత్తం	117909	125161	243332	269

చీరలే శ్రీరామరక్ష



పెద్దేముల్ మండలం తట్టెపల్లి సమీపంలో మొక్కజొన్న పంటకు రక్షణగా ఏర్పాటు చేసిన చీరలు

పెద్దేముల్, సెప్టెంబరు 9: అడవి పందుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పంట నాశనం కాకుండా కాపాడుకునేందుకు ఎన్నో కష్టాలు పడుతున్నారు. కొందరు సోలార్ పానెళ్లను ఏర్పాటు చేసుకుంటుంటే.. చిన్న, సన్నకారు రైతులు పాత చీరలను పంటలకు రక్షణగా వాడుకుంటున్నారు. పొలం చుట్టూ చీరలు కట్టడం వల్ల అడవి పందులు రావడం లేదని రైతులు చెబుతున్నారు.

కాళోజీ యాదిలో..

కలంతో కవి కాళోజీ చిత్రం గీసిన సూక్ష్మ చిత్రకారుడు డాక్టర్ అశోక్





అశోక్ గీసిన కాళోజీ చిత్రం

దౌల్తాబాద్, సెప్టెంబరు 9: మండలంలోని యాంకి గ్రామానికి చెందిన డాక్టర్ సున్నపు అశోక్ సూక్ష్మ చిత్రకళలో సిద్ధహస్తుడు. తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవి కాళోజీ బొమ్మ గీసి ఆ సాహిత్య సత్పురుషుడిపై తన కళాభిమానాన్ని చాటుకున్నాడు. ప్రజా కవి, తెలంగాణ ఉద్యమకారుడు, నిజాం నిరంకుశత్వాన్ని ప్రశ్నించిన గొంతుక, ప్రజా చైతన్య మూర్తి, పద్మ విభూషన్ కాళోజీ నారాయణరావు 110వ జయంతి సందర్భంగా ఆ మహనీయుడి యాదిలో తన కలంతో ఆయన చిత్రాన్ని గీసి నివాళులర్పించాడు. ఈ సందర్భంగా పలువురు అశోక్ గీసిన చిత్రాన్ని చూసి అభినందించారు.

సమన్వయంగా పని చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్

తాండూరు, సెప్టెంబరు 9: ఈ నెల 11వ తేదీన తాండూరులో జరిగే వినాయక నిమజ్జన కార్యక్రమంలో అధికారులందరూ బాధ్యతగా సమన్వయంగా పనిచేయాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ఆదేశించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ, ఫైర్, ఇరిగేషన్ శాఖల అధికారులతో నిమజ్జనంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నిమజ్జనం, ఊరేగింపు జరిగే రోడ్లలో గుంతలను పూడ్చడం, శానిటేషన్ లైట్లను మున్సిపల్ అధికారులు చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఊరేగింపు వివరాలను పోలీస్ శాఖను అడిగి తెలుసుకున్నారు. ఊరేగింపు సమయంలో విద్యుత్ వైర్లను ముందుగానే గుర్తించాలని విద్యుత్ ఏఈకి సూచించారు. నిమజ్జనం చేసే ప్రాంతాలైన మల్‌రెడ్డి, కోకట్ కాగ్నా నది వద్దకు పిల్లలను వెళ్లనీయొద్దన్నారు. ప్రత్యేక పోలీసు బలగాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి వివరించారు. ఈ సమావేశంలో తాండూరు తహసీల్దార్ తారాసింగ్, డీఎల్పీవో శంకర్‌నాయక్, పీఆర్ డీఈఈ, కమిషనర్, విద్యుత్‌శాఖ ఏఈ, అధికారులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



అన్నారంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కొడంగల్, సెప్టెంబరు 9: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. పత్తి, మినుము, పెసర పంటలు దెబ్బతినడంతో కొడంగల్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రైతులు మూడు రోజుల కిందట కొడంగల్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన అధికారులు సోమవారం ఏఈవో దేవేందర్ రాథోడ్ ఆధ్వర్యంలో పంట పొలాలను పరిశీలించారు. పత్తిపొలాల్లో నీరు చేరడంతో నష్టానికి గురైనట్లు రైతులు సాయిలు, మల్లప్ప, రాములు, మహిబూబ్, ఎల్లప్ప అధికారులకు వివరించారు. నష్టపోయిన పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు ఏఈవో తెలిపారు.

గుంతల రోడ్డుపై వరినాట్లు

బీజేపీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన



కంకల్ రోడ్లపై పడిన గుంతల్లో వరినాట్లు వేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

పూడూరు, సెప్టెంబరు 9: మండల పరిధిలోని కంకల్ గ్రామంలో రోడ్డుపై గుంతలు పడి వర్షానికి నీరు నిలిచి అధ్వానంగా మారాయి. గుంతల రోడ్లను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని బీజేపీ నాయకులు ఆరోపించారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం పూడూరు రోడ్డుపై వరినాట్లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ కంకల్, మండల ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య తదితరులు మాట్లాడుతూ.. 12ఏళ్లుగా ఈ గుంతల రోడ్లను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గుంతలతో బురదమయంగా మారిన రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కంకల్ నుంచి చిట్టెంపల్లి గేటు వరకు పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ కంకల్, మండల ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, శక్తి కేంద్రం ఇన్‌చార్జి విఠల్, అశోక్, శివకుమార్, మేకల చంద్రశేఖర్, శ్రీను, గ్రామస్తులు, జంగయ్య, నారాయణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



యాలాల మండం కోకట్ వాగు దగ్గర వినాయక నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

యాలాల, సెప్టెంబరు 9: మండలంలోని కోకట్ కాగ్నా వాగు వద్ద జరిగే వినాయక నిమజ్జనం స్థలాన్ని సబ్‌కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ ఉన్నారు.

పెద్దచెరువు అన్యాక్రాంతం!

(5వ పేజీ తరువాయి..)

దర్శనమిస్తున్నాయి. దీంతో వెంచర్ లోపల నీరు చేరకుండా గత కొద్ది రోజులుగా పెద్ద మొత్తంలో మట్టి డంపు చేసి నీరు లోపలికి రాకుండా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా ఈ వెంచర్‌కు ఆనుకుని ఉన్న మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే మరో వెంచర్‌లోనూ బఫర్‌జోన్‌లో విల్లాలు చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంచర్ నాలుగు దిక్కుల పక్కాగా ప్రహరీ ఏర్పాటు చేసి లోపల పనులు చేపడుతున్నందున బాహ్య ప్రపంచానికి చెరువు బఫర్ జోన్ కబ్జా కనబడని పరిస్థితి నెలకొంది. ఈ విల్లాలు నిర్మిస్తున్న రియల్‌ఎస్టేట్ సంస్థ వారికి రాష్ట్ర రాజకీయాలను శాసించే నేతల అండదండలు ఉండటంతో అటు పక్క వెళ్లడానికి కూడా అధికారులు జంకుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు ఎలా స్పందిస్తారని స్థానికులు ఎదురుచూస్తున్నారు.



ఎఫ్‌టీఎల్ పరిధిలో చదును చేసిన స్థలం

కాలువల విధ్వంసం

చెరువు కట్ట కింద వ్యవసాయ పొలాలకు నీరు వెళ్లే పెద్ద కాలువలు, పిల్ల కాలువలు, అలుగు నీరు పారే పెద్ద నాలా పూర్తి స్థాయిలో కబ్జాకు గురయ్యాయి. చెరువు కట్ట కింద స్థలాల్లో వెలిసిన వెంచర్ల కారణంగా వ్యవసాయ పొలాలకు నీరందించే కాలువలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. విలేజ్ మ్యాప్‌లో కాలువలు కనబడుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. చెరువు అలుగు నీరు పారే పెద్ద కాలువ ఇరువైపున ఉన్న బఫర్‌జోన్ స్థలంలోనూ పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టారు. కాలువ 15 మీటర్ల వెడల్పు ఉండాల్సి ఉండగా 8 మీటర్లకు కుచించుకు పోయింది. నాలా ఇరు వైపున తొమ్మిది మీటర్లు వదిలి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా కొందరు నాలాను ఆనుకుని నిర్మాణాలు చేపట్టారు. దీంతో నాలా మొత్తం కుచించుకు పోయి చిన్న కాలువగా మారింది.



నీట మునిగిన ఓ ఎన్‌క్లేవ్‌లోని రోడ్లు, ప్లాట్లు

ఆక్రమణలపై చర్యలు చేపట్టాలి



హద్దు రాళ్లను తొలగించి రియల్టర్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపట్టారు. పద్మశ్రీ ఎన్‌క్లేవ్‌లో 6 ఎకరాల ఎఫ్‌టీఎల్ స్థలంలో ప్లాట్లు, రోడ్లు ఏర్పాటు చేసినట్లు గుర్తించాం. ప్రస్తుతం అక్కడే సమీపంలో 24 ఎకరాల్లో కొత్తగా నిర్మిస్తున్న విల్లాస్ వెంచర్ వెనుక భాగంలో బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపడుతున్నారు కాలువలు, అలుగు నాలా పూర్తిగా కబ్జాకు గురయ్యాయి. అధికారులు చర్యలు తీసుకొని చెరువును కాపాడాలి.

- వేముల శ్రీనివాస్‌రెడ్డి, సాగునీటి సంఘం మాజీ చైర్మన్

లేనిది ఉన్నట్లుగా రోగ నిర్ధారణ

ఆస్పత్రిపై మహిళ ఫిర్యాదు

మేడ్చల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లేని రోగం ఉన్నట్లు ఉన్నట్టుగా రిపోర్టులు ఇచ్చి కొత్త ఆరోగ్య సమస్యను తీసుకొచ్చిన ఓ ప్రైవేటు ఆస్పత్రిపై, పరీక్షలు నిర్వహించిన డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ మహిళ సోమవారం కలెక్టరేట్‌లోని డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. వైద్యంచేసి రోగం నయం చేస్తారని ఆస్పత్రికి వెళ్తే ప్రాణం పోయినంత పనిచేశారని తన గోడును వెల్లబోసుకుంది. బాధితురాలి వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన బి.స్వాతి గత మార్చి నెలలో గొంతుపై వాపు రావటంతో దుండిగల్‌లోని ఆరుంధతి ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వెళ్లగా ఆస్పత్రి నిర్వాహకులు క్షయ వ్యాధి సోకి ఉండవచ్చనే అనుమానంతో ఎఫ్ఎన్ఏసీ పరీక్షలు చేయించారు. రిపోర్టుల్లో నెగెటివ్ రావటంతో సాధారణ మందులు ఇచ్చి పంపించారు. అనంతరం స్వాతికి జ్వరం రావటంతో మేడ్చల్‌లోని లీలా ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లింది. ఆస్పత్రి వైద్యులు టీబీ ఉండవచ్చన్న అనుమానంతో తిరిగి ఎఫ్ఎన్ఏసీ పరీక్ష కోసం స్థానిక టెస్లా డయగ్నస్టిక్ సెంటర్‌కు పంపి పరీక్షలు చేయించగా అందులో పాజిటివ్‌గా తేలింది. దీంతో రిపోర్టులు తీసుకుని స్వాతి ఏప్రిల్ 30వ తేదీన మేడ్చల్ టీబీ సెంటర్‌కు వెళ్లి క్షయ వ్యాధి(టీబీ)కి సంబంధించిన మాత్రలను వాడటం ప్రారంభించింది. దీంతో ఆరోగ్యం మరింత క్షీణించి మే 5వ తేదీన స్థానికంగా ఉన్న సంప్రద ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని అక్కడా టీబీ టెస్ట్ చేయగా నెగెటివ్ వచ్చింది. దీంతో తనకు లేని రోగానికి మందులు ఇచ్చి ఆరోగ్యం మరింత క్షీణింపజేశారంటూ బాధితురాలు లీలా ఆస్పత్రి, టెస్లా డయాగ్నస్టిక్ సెంటర్‌పై జిల్లా వైద్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. తప్పుడు మందులు వాడటంతో తన ఆరోగ్యం మరింత క్షీణించటంతో రూ.4లక్షల వరకు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్నానని బాధితురాలు వాపోయింది. ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని స్వాతి అధికారులతో మొరపెట్టుకుంది.



కలెక్టరేట్ వద్ద తన గోడు వెల్లబోసుకుంటున్న స్వాతి

పొలంలో భారీ కొండ చిలువ



యాచారం, సెప్టెంబరు 9 : మూడున్నర మీటర్ల పొడవైన కొండచిలువ గ్రామ సమీపంలోని పంట పొలంలో కనిపించడంతో గ్రామస్తులు భయాందోళన చెందిన సంఘటన కుర్మిద్దలో జరిగింది. సోమవారం రైతు కిషన్‌రెడ్డి తన పొలంలో పచ్చిగడ్డి కోస్తుండగా భారీ కొండ చిలువ కనిపించింది. దీంతో రైతు తేరుకొని పాముకు దూరంగా పరుగెత్తాడు. విషయాన్ని వెంటనే గ్రామస్తులకు చెప్పాడు. రైతులు కొండచిలువను గ్రామానికి దూరంగా తీసుకెళ్లి చంపేశారు. ఏడాది కింద కూడా ఓ కొండ చిలువ హైటెన్షన్ వైర్లపై పాకడంతో అటవీ శాఖ అధికారులు దాన్ని తీసి అడవిలో వదిలారు. గ్రామ సమీపంలో తరచూ కొండచిలువలు కన్పిస్తుండడంతో ఎప్పుడేప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయపడుతున్నారు.

అలుగు పారుతున్న సురసముద్రం చెరువు



నిండుగా ఉన్న సురసముద్రం చెరువు

ఆమనగల్లు, సెప్టెంబరు 9 : భారీ వర్షాలతో ఆమనగల్లు సురసముద్రం చెరువు నిండింది. చెరువు అలుగు రెండోరోజు సోమవారం కూడా ప్రవహించింది. ఇరిగేషన్, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. చెరువు వద్ద నిఘా ఏర్పాటు చేశారు. రెండేళ్ల తర్వాత సురసముద్రం చెరువు అలుగు పారడంతో చూసేందుకు స్థానికులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. అలుగు సమీప ఇళ్లను ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. సురసముద్రం చెరువు అలుగు పారి మేడిగడ్డ కత్వ వాగులోకి చేరుతోంది. దీంతో మేడిగడ్డ-శంకర్ కొండ తండాల మధ్య వాగుపై రాకపోకలు నిలిచాయి. పలుగ్రామాల్లో జొన్న పంట దెబ్బతింది. మేడిగడ్డ తండా సమీపంలో వానకు నేలకొరిగిన జొన్న చేనును కోసి రైతులు పశువులకు మేత వేస్తున్నారు. శెట్టిపల్లి చెరువు దిగువన జొన్న, పత్తి, వరి పంటలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. వర్షాలకు గ్రామీణ రోడ్లు దెబ్బతిని రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ సమితి



నియామకపత్రం అందుకుంటున్న సిద్ధార్థ

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 9 : ఆలిండియా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షుడిగా ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లికి చెందిన బాదెపల్లి సిద్ధార్థ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని మాతా రమాబాయి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సమావేశంలో జాతీయ అధ్యక్షుడు జి.మురళీధర్‌రావు ఆయనకు నియామకపత్రం అందజేశారు. సిద్ధార్థ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషిచేస్తానని తెలిపారు.

పరిహారం చెల్లించాకే 765కేవీ లైన్ పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న చింపుల సత్యనారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9 : రైతులకు నష్టపరిహారం చెల్లించిన తరువాతే 765 కేవీ ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణం చేపట్టాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం లక్డీకాపూల్‌లోని తన కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో చేపడుతున్న 765ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణ పనులతో రైతులు తమ భూములను కోల్పోతున్నారని తెలిపారు. రైతులు, రైతు సంఘాలతో చర్చించి నష్టపరిహారాన్ని లెక్కగట్టి పరిహారాన్ని నిర్ణయించాలన్నారు. రైతులకు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా బీఆర్-మహేశ్వరం ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. ఈ నిర్మాణంతో రంగారెడ్డి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాల్లో 20మండలాల్లో 315 గ్రామాల మీదుగా 190కిలో మీటర్ల మేర లైన్ వెళ్తోందని, దీనితో రైతులు 3,200ఎకరాల భూమి కోల్పోవాల్సి వస్తుందన్నారు. 2013-14లో 400కేవీ లైన్ వేసినప్పుడు ఇచ్చిన పరిహారాన్నే ఇప్పుడు ఇవ్వాలని చూస్తున్నారని, పదేళ్ల తర్వాత కూడా ఇదే పరిహారం ఇలా ఇస్తారని, భూముల రేటు నాలుగింతలు పెరిగిందన్నారు. జీవోను చూపి దౌర్జన్యంగా పొలాల్లో 765కేవీ లైన్ పనులు చేస్తున్నారని ఆరోపించారు. పనులను వెంటనే ఆపకుంటే రైతుల పక్షాన రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. 2003 ఎలక్ట్రిసిటీ చట్టం, 2017 సుప్రీంకోర్టు తీర్పుల అనుసరించి ఒక్కో టవర్‌కు 15-20లక్షలు అందేలా, కారిడార్ లైన్‌కు మరో 15-20లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ కార్యదర్శి మాదిపల్ వెంకట్ ఉన్నారు.

రైతులను తిప్పించుకోవడం లేదు

సాంకేతిక పొరపాట్లను సరిదిద్దుతున్నాం

ఏడీఏ రుద్రమూర్తి వివరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, సెప్టెంబరు 9: వ్యవసాయ కార్యాలయాలకు రైతులను తిప్పించుకోవడంలేదని, సవరణ చేసేందుకు వ్యవసాయాధికారిని కలువని చెప్పామని తాండూరు ఏడీఏ రుద్రమూర్తి స్పష్టం చేశారు. 'రుణమాఫీ కాలేదు.. న్యాయం చేయండి' అనే శీర్షికన ఈనెల 6వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఏడీఏ స్పందించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇస్తామని సాంకేతిక పొరపాట్లను సరిదిద్దుతున్నామన్నారు. తాండూరు పట్టణం మల్‌రెడ్డిపల్లికి చెందిన రైతు దస్తగిరి వెంకటయ్య జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి కలిసి రెండు ఖాతాలతో పాటు మరో వ్యక్తి మక్తల్ చిన్న అంజన్న ఖాతా వివరాలు నమోదవడంతో రుణమాఫీ కాలేదని తెలిపారు. మొత్తంగా రూ.3లక్షల 95వేల 666 నమోదైందని చెప్పారు. యూబీఐతో తాండూరులో, మక్తల్ బ్రాంచ్‌లో రుణాన్ని పొందారని ఒక కస్టమర్ ఐడీ వేర్వేరు ఆధార్ నంబర్లకి మ్యాప్ చేయడం వల్ల, గ్రూపు రుణం వల్ల, ఒకే రుణ ఖాతా ఒకరి కన్నా ఎక్కువ మందికి లింక్ కావడం వల్ల ఇలా జరిగి ఉండవచ్చని స్పష్టం చేశారు. రైతు వెంకటయ్య బ్యాంకుకు వెళ్లి వ్యవసాయ శాఖ అధికారితో మాట్లాడాలని సూచించామే తప్ప తప్పించుకోవడంలేదన్నారు. సవరణ చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సహకరిస్తున్నారని ఏడీఏ కోరారు.

కోదండరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



కోదండరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 9 : తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ-రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ముదిరెడ్డి కోదండరెడ్డిని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోమవారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన నాయకులు శేఖర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, త్యాలపల్లి కృష్ణ, అలీ ఉన్నారు. అలాగే కొత్త పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కూడా కలిసి సన్మానించారు.

ప్రెస్ చాంపియన్‌షిప్‌లో చేవెళ్ల వాసుల ప్రతిభ



చేవెళ్ల, సెప్టెంబరు 9: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్ జిల్లాల బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో చేవెళ్ల వోగ్ ఫిట్‌నెస్ సభ్యులు ప్రతిభ చూపారు. చేవెళ్లకు చెందిన సాయితేజ, నవీన్ కుమార్‌రెడ్డి స్వర్ణం, జూనియర్ కేటగిరీలో శివశంకర్ స్వర్ణ పతకం సాధించారు. వెంకట్‌రాంరెడ్డి, చంద్రశేఖర్, రాజుకుమార్‌లు కాంస్యం సాధించారు. ఈ సందర్భంగా వారు కోచ్ శ్రీశైలానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దప్పు కళాకారుడికి అఖండ నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న అంబేద్కర్

యాచారం, సెప్టెంబరు 9 : మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన దప్పు కళాకారుడు తాండ్ర అంబేద్కర్ సోమవారం నగరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నేషనల్ అఖండ నంది అవార్డును అందుకున్నారు. నటులు రజిత, శ్రీనివాస్, ఆదివాసి కళాకారుల డైరెక్టర్ శ్రీధర్‌లు అవార్డును ప్రదానం చేశారు. రాష్ట్ర కళా సమితి నిర్వహించిన దప్పు కళాకారుల పోటీలో అంబేద్కర్ ఉత్తమ ప్రదర్శన చేశారు. తనకు అవార్డు రావడం ఆనందంగా ఉందని అంబేద్కర్ అన్నారు.

నాలుగు కొమ్ముల గొర్రెపొట్టేలు

చూసేందుకు ఎగబడిన జనం



నాలుగు కొమ్ములతో ఉన్న గొర్రె

పెద్దేముల్, సెప్టెంబరు 9: గొర్రెలు, మేకలకు సాధారణంగా రెండు కొమ్ములు మాత్రమే ఉంటాయి. కాని ఒక గొర్రెకు నాలుగు కొమ్ములు ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ వింత పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెంగోల్ కుర్వ వెంకటయ్య వద్ద గొర్రెలు ఉన్నాయి. అతడి వద్ద ఉన్న గొర్రెలలో ఒకగొర్రెకు నాలుగుకొమ్ములు వచ్చాయి. అతడి వద్ద ఉన్న గొర్రెలను రోజూ బీడుభూముల్లో మేపడానికి తీసుకెళ్తుంటే రోడ్డుపై వెళ్లేవారు నాలుగుకొమ్ముల గొర్రెను చూడగానే ఆశ్చర్యపోతున్నారు. వారి వాహనం నిలిపి దానిని ఫొటోలు తీసుకుంటున్నారు. ఇలాంటి గొర్రెను తాము ఎక్కడ చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని, చాలా మంది గొర్రెను అమ్ముతావా అని అడుగుతున్నారని గొర్రెల కాపరి వెంకటయ్య తెలిపాడు. కానీ ఆ గొర్రెను తాను అమ్మబోనని చెప్పాడు.

జీవ నదిలా ప్రవహించేది తెలుగు భాష



కార్యక్రమంలో మాట్లాడుతున్న డా.బాణాల భుజంగరెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 9: తెలంగాణ భాష జీవద్భాష అని, ఇతర భాషల పదాలన్నింటినీ తనలో కలుపుకొని ఓ జీవనదిలా ప్రవహించే పలుకుబడుల భాష అని కేంద్రీయ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డా.బాణాల భుజంగరెడ్డి అన్నారు. డా.కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఆనాటి నాయకుడు జయప్రకాశ్‌నారాయణ గురించి పలికిన 'పుట్టుక నీది. చావు నీది. బతుకంతా దేశానిది' అనే మాటలు ఆయనకే వర్తిస్తాయన్నారు. ఆయన తన జీవితమంతా తెలంగాణ ప్రజాజీవనం, భాషా సంస్కృతుల పరిరక్షణ కోసం ఉద్యమించారని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమం, గ్రంథాలయ ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన ప్రత్యేక ముద్ర వేశారంటూ గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక, తెలుగు విభాగం అధ్యక్షుడు డా.కె.సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని విద్యావనరుల కేంద్రంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు డా.వి.పరమేష్, చంద్రశేఖర్, జమీర్, మల్లేష్, విష్ణు, ఆనంద్, మహేష్ తదితరులు ఉన్నారు.

చిలుక వాగు పరిశీలన



తాండూరు చిలుక వాగు మ్యాప్ ను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ అధికారులు

తాండూరు, సెప్టెంబరు 9: తాండూరు పట్టణంలోని చిలుక వాగును సోమవారం వెస్ట్ సర్కిల్ పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. తాండూరులో వస్తున్న వరదనీటి మళ్లింపుపై మ్యాప్‌ను పరిశీలించారు. పట్టణంలో ఉన్న నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా నీటి మళ్లింపును పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న రూ.16కోట్ల నిధులకు అదనంగా మరో రూ.20కోట్ల నిధులు అవసరమని అంచనా వేసినట్లు సమాచారం. వారివెంట తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రం సింహారెడ్డి, డీఈ మణిపాల్ ఉన్నారు.

పంటకు నష్టం కలిగించిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి


ఎంపీడీవో హిమబిందుకు వినతిపత్రం ఇస్తున్న గొల్లగూడ గ్రామస్తులు

చేవెళ్ల, సెప్టెంబర్ 9 : గ్రామ పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వలన వరి పంటకు నష్టం జరిగిందని ఉన్నతాధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గొల్లగూడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. గొల్లగూడ పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ పంచాయతీ సిబ్బందితో ఇటీవల గ్రామానికి వచ్చే రోడ్డు వెంబడి గడ్డి మందు చల్లించాడు. అయితే గడ్డిమందు చల్లుతున్న తరుణంలో రోడ్డు పక్కన గ్రామానికి చెందిన శ్రీశైలంతోపాటు పలువురు రైతుల వరి పంట పొలాలు ఉన్నాయి. సిబ్బంది నిర్లక్ష్యంగా గడ్డి మందు పిచికారి చేయడంతో పంటపై పడి వరి పంటకు నష్టం జరిగింది. అదేమని గ్రామ కార్యదర్శి మురళీకృష్ణను రైతులు ప్రశ్నిస్తే ఏం చేసుకుంటారో చేసుకోండి అని అన్నాడని రైతులు, గ్రామస్తులు సోమవారం ఎంపీడీవో హిమబిందును కలిసి ఫిర్యాదు చేశారు. గడ్డిమందు పిచికారితో వరి పంటకు నష్టం జరిగిందని, తమకు న్యాయం చేయాలని రైతులు అధికారులను కోరారు. దీంతో వరి పంటను పరిశీలించి కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారని రైతులు చెప్పారు.

దశల వారీగా.. ప్రజాసమస్యల పరిష్కారం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, సెప్టెంబరు 9: ప్రజా సమస్యలను ప్రాధాన్య క్రమంలో దశలవారీగా పరిష్కరిస్తామని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. 12వ వార్డు ఎంపీ పటేల్‌గూడలో వైస్ చైర్మన్ కామండ్ల యాదగిరి, కౌన్సిలర్ నారని మౌనికసుధాకర్‌గౌడ్‌లతో కలిసి సోమవారం రూ.5 లక్షల విలువైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రతీ వార్డులో ప్రజాసమస్యలు గుర్తించామని సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి పనులకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేస్తామన్నారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శ్రీరామ్, రవి, సాయి, ధన్‌రాజు, నారాయణ, శివం, నర్సింహ, శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్య, బాషమ్మ పాల్గొన్నారు.

నిధుల మంజూరు కోసం ఎంపీకి వినతి


మల్లు రవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, సెప్టెంబరు 9: కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని కోరారు. సోమవారం వారు రవిని హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అభివృద్ధి పనులకు నిధుల మంజూరు, సమస్యల పరిష్కారానికి ఎంపీకి వినతిపత్రం అందజేశారు. కడ్తాలలో 30పడకల ఆసుపత్రి, 108అంబులెన్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బస్టాండ్ ఏర్పాటు చేయాలని, ఆమనగల్లులో అసంపూర్తి పనులను పూర్తిచేయాలని కోరారు. ఇటీవలి వర్షాలకు ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో దెబ్బతిన్న చెరువు, కుంటలు, పాడైన రోడ్ల మరమతులకు నిధులివ్వాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ఎంపీ రవి సానుకూలంగా స్పందించారని శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, కేశవులు పేర్కొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన నిందితులను శిక్షించాలి

ఆమనగల్లు, సెప్టెంబరు 9: గద్వాల జిల్లాలో ఇద్దరు దళిత బాలికలపై లైంగికదాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ, పార్లమెంటరీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ సభ్యుడు మల్లు రవి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పోలీలను కోరారు. డీజీపీ, డీఐజీ, జోగులాంబ గద్వాల కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని పేర్కొన్నారు. లైంగిక దాడికి పాల్పడిన వారెవరైనా ఉపేక్షించకూడదని తెలిపారు. పాఠశాలకు బయలుదేరిన బాలికలపై దుండగులు లైంగికదాడికి పాల్పడడం హేయం అని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఇలాంటి ఘటనలకు తావుండకూడదన్నారు. మహిళలు, బాలికల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వ పటిష్ట చట్టాలు అమలు చేస్తుందని ఎంపీ పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

కడ్తాల్, సెప్టెంబరు 9: మైసిగండి ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్ట్‌లు బోధనకు కాంట్రాక్ట్ పద్ధతిన నియామకానికి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బాల్‌రాజ్ సోమవారం తెలిపారు. 2024-2025కు కాంట్రాక్ట్ నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. కడ్తాల మండల వాసులకు తొలిప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, డిగ్రీ, బీఈడీ, టెట్ పాసై కలిగి ఉండాలని తెలిపారు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్చ్సేంజీలో నమోదై 2020జూలై 1 నాటికి 18నుంచి 39ఏళ్లలోపు వారు, రిజర్వు కేటగిరీ అభ్యర్థులు 45 సంవత్సరాల వరకు అర్హులన్నారు. ఈ నెల 18వ తేదీకల్లా కలెక్టర్ కాంప్లెక్స్ లోని ఎస్టీ వెల్ఫేర్ కార్యాలయంలో దరఖాస్తులివ్వాలని పేర్కొన్నారు.

ముత్యాలమ్మ గుడి భూమిని కాపాడండి

కేశంపేట, సెప్టెంబర్ 9: కొత్తపేటలోని సర్వే నంబర్ 2లో 18గుంటల ముత్యాలమ్మ గుడి భూమి, సర్వే నంబర్ 1కి అనుసరించి ఉన్న గ్రామ కంఠం 500గజాల భూమిని కాపాడాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డికి సోమవారం గ్రామ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు వినతి పత్రం ఇచ్చారు. కొందరు సర్వే నంబర్ 1లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకుని, సర్వే నంబర్ 2లోని గుడి స్థలంలో ఇల్లు కడుతున్నారని తెలిపారు. తెల్కల రాంరెడ్డి సర్వే నంబర్ 1లో గ్రామ కంఠం భూమి 500గజాలను యాదయ్యకు రిజిస్ట్రేషన్ చేయించాడని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పాఠశాలలో ఘనంగా కాళోజీ జయంతి


పాఠశాలలో కాళోజీ జయంతి వేడుకలు

చౌదరిగూడ, సెప్టెంబరు 9: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఇంద్రనగర్ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో టీచర్లు నరేష్, ప్రవీణ్‌కుమార్, శ్రీశైలం, భీమ్లాల్, ఇందిర, ఉషాకిరణ్, అనూష, కవిత, శేఖర్, ఉమామహేశ్వరి, రామస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం


కరాటే ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

కడ్తాల్, సెప్టెంబరు9:ఆత్మ రక్షణకు కరాటే దోహదపడుతుందని కరాటే మాస్టర్ సోను అన్నారు. బాలికలు కరాటేపై దృష్టి సారించాలని సూచించారు. కడ్తాలలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కరాటే శిక్షణ తరగతులను హెచ్‌ఎం అరుణతో కలిసి సోను ప్రారంభించారు. ఆత్మరక్షణకు పలు విషయాలపై బాలికలకు వివరించారు. అమ్మాయిలు దాడులను ఎలా ఎదుర్కోవాలి? విపత్కర పరిస్థితుల్లో ఎలా బయటపడాలో శిక్షణ తరగతుల్లో వివరించారు.

పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, సెప్టెంబరు 9: శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన స్థానిక పేదలకు కేటాయించాలని శంకర్‌పల్లి మాజీ ఎంపీపీలు డి.గోవర్ధన్‌రెడ్డి, నర్సింహ, బీజేపీ మండల అధ్యక్షుడు రాములు, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, బయ్యన్న, పాండురంగం, ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం శంకర్‌పల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటికి కేయించిన 150 ఇళ్లను నిజమైన అర్హులకే ఇవ్వాలన్నారు. నాయకులు తమకు నచ్చిన వారికే కేటాయిస్తే ధర్నాలు చేస్తామన్నారు.

కొర్రతండాలో లో ఓల్టేజీ సమస్య తీర్చండి


సింగల్ ఫేస్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద బాల్‌నాయక్

మాడ్గుల, సెప్టెంబరు 9: కొర్రతండాలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో తండా వాసులు ఇబ్బంది పడుతున్నారు. తండాకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను వేసి సమస్య తీర్చాలని గిరిజన సంఘం నాయకుడు కొర్రం బాలునాయక్ అధికారులను కోరారు. తండా జనాభా 600కుపెగా ఉందన్నారు. సింగల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ సరిపోక లో ఓల్టేజీ వస్తోందని చెప్పారు. బల్బులు గుడ్డి దీపంలా వెలుగుతున్నాయన్నారు. ఓవర్ లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్ మూడుసార్లు కాలిపోయిందన్నారు. అదనంగా మరో సింగల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మన్‌ను మంజూరు చేయాలని లేదా త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ అయినా ఇవ్వాలని తండా వాసులు కోరుతున్నారు. ఈ సమస్యపై పలుసార్లు ట్రాన్స్‌కో ఏఈ, డీఈలకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తండాలో నెలకొన్న కరెంటు సమస్య తీర్చాలని కోరుతున్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

యాచారం, సెప్టెంబరు 9 : పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేసి, జూలై నెల వేతనాలు తక్షణమే చెల్లించాలని పీఆర్‌టీయుటీఎస్ రాష్ట్ర నాయకులు బి.జగన్‌మోహన్‌గుప్తా, జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం గడ్డమల్లాయగూడ, చిన్నతూండ్ల, కుర్మిద్ద, తక్కళ్లపల్లి, కొత్తపల్లి పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నారు. వారికి సంఘం సభ్యత్వమిచ్చారు. వారు మాట్లాడుతూ మెరుగైన ఫిట్‌మెంట్, పీఆర్‌సీ ప్రకటించాలని కోరారు. డీఎస్సీ వేసి టీచర్ పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయుటీఎస్ సంఘ యాచారం మండల అధ్యక్ష కార్యదర్శులు యాదగిరి, కలకొండ భోజయ్య, జిల్లా బాధ్యులు తిరుమలేష్, శ్రవణ్, మహేష్, హరిప్రసాద్, యాదగిరి తదితరులున్నారు.

పీఆర్టీయూ మండలాధ్యక్షురాలిగా పద్మావతమ్మ



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న గోవర్ధన్ యాదవ్

కడ్తాల్, సెప్టెంబరు 9 : పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఎమ్మార్సీలో యూనియన్ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. టీచర్ల సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందించారు. అనంతరం యూనియన్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షురాలిగా ఎ.పద్మావతమ్మ, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్, ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మ, కార్యదర్శిగా రామ్మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పత్రికా సంపాదకవర్గ సభ్యులు జగన్‌మోహన్‌గుప్తా, కృష్ణారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు నరోత్తమ్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సుదర్శన్, మలీశ్వరి, టీచర్లు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధులివ్వండి


సీఎంతో ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, సెప్టెంబర్ 9: భారీ వర్షాలకు చేవెళ్ల నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నిధులు, పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే యాదయ్య కోరారు. సోమవారం రాత్రి సెక్రటేరియట్‌లో ఎమ్మెల్యే సీఎంను కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలపై వివరించారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీఎంకు వినతిపత్రం అందజేశారు.

ఓపీఎస్ పునరుద్ధరణకు అవిశ్రాంత పోరాటం


లేమూరులో సభ్యత్వ నమోదులో యూటీఎఫ్ నాయకులు

కందుకూరు, సెప్టెంబరు 9 : పాత పెన్షన్ విధానం(ఓపీఎస్) పునరుద్ధరణ అయ్యేవరకు అవిశ్రాంత పోరాటం చేస్తామని టీఎస్ యూటీఎఫ్ సంఘం జిల్లా నాయకుడు జగన్నాథ్ అన్నారు. సోమవారం వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు హెల్త్ కార్డులను జారీ చేసి బదిలీల్లో వచ్చిన టీచర్లకు జూలై నెల జీతాలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు ఎడ్ల కలేష్, నాయకులు జై.బుగ్గ రాములు, నజీర్, హుస్సేన్, పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనమందించాలి

తలకొండపల్లి, సెప్టెంబరు 9 : మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం అందించాలని ఎంఈవో సర్దార్‌నాయక్ కోరారు. వెనుకబడ్డ విద్యార్థినులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆయన సూచించారు. తలకొండపల్లిలోని కేజీబీవీ పాఠశాలను సోమవారం ఎంఈవో తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, పరిసరాలను, మరుగు దొడ్లు, మూత్రశాలలను, తరగతి గదులను, వంటకాలను పరిశీలించారు. కేజీబీవీ విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం ప్రార్థనకు హాజరై అక్కడ ఉపాధ్యాయినులకు పలు సూచనలు చేశారు.

పీసీసీ అధ్యక్షుడికి నేతల శుభాకాంక్షల వెల్లువ


మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏనుగు జంగారెడ్డి, కృష్ణానాయక్

కందుకూరు/కడ్తాల్, సెప్టెంబరు 9: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ మెంబర్ ఏనుగు జంగారెడ్డి ఘనంగా సత్కరించారు. సోమవారం నగరంలోని గాంధీ భవన్‌లో కలిశారు. బీసీ నేత మహేష్‌కుమార్‌గౌడ్‌కు రాష్ట్ర పార్టీ పగ్గాలిచ్చేలా కృషిచేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కృష్ణానాయక్, అఫ్జల్‌బేగ్, పాండుకురుమ, పాండురంగారెడ్డి, రాకేష్‌గౌడ్, ఖాజామొహినుద్దీన్, జగన్, వి.బాబు, రవి, వి.శ్రీనివాస్‌నాయక్, ఎం.శేఖర్, రహీస్, శేఖర్ పాల్గొన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ జిల్లా నాయకుడు జవహర్‌లాల్, యువజన కాంగ్రెస్ కడ్తాల్ మండల అధ్యక్షుడు హీరాసింగ్ కలిసి సత్కరించారు. స్థానికంగా పార్టీ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో తులసీరామ్‌నాయక్, రాము ఉన్నారు.


మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జవహర్‌లాల్, హీరాసింగ్

చేవెళ్లను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలి


మల్లారి వైభవ్‌రెడ్డి

చేవెళ్ల, సెప్టెంబరు 9: చేవెళ్ల పంచాయతీని ప్రభుత్వం వెంటనే నూతన మున్సిపాలిటీగా ఏర్పాటుచేయాలని బీజేపీ జిల్లా యువ నాయకుడు మల్లారి వైభవ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్నా చేవెళ్ల అభివృద్ధి పరంగా వెనుకబడే ఉందన్నారు. చేవెళ్ల చుట్టూ ఉన్న గ్రామాలతో ప్రభుత్వం మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలన్నారు. చేవెళ్ల పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ఉందన్నారు. చేవెళ్లను మున్సిపాలిటీగా చేసేందుకు అన్ని అర్హతలూ ఉన్నాయన్నారు. మున్సిపాలిటీ ఏర్పాటుకు ప్రజలంతా సహకరిస్తారని అన్నారు.ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి ఏడాది కిత్రమే చేవెళ్ల మున్సిపాలిటీగా మారిందని ప్రకటించారని గుర్తుచేశారు. చేవెళ్లను మున్సిపాలిటీగా మార్చిన తర్వాతే మిగిలిన గ్రామాలకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్నారు.

హక్కుల సాధనకు సంఘటితం కావాలి


సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరిస్తున్న లక్‌పతి నాయక్

కడ్తాల్, సెప్టెంబరు9 : హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి గిరిజనులు సంఘటితంగా ముందుకు సాగాలని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రఘురాం రాథోడ్, రాష్ట్ర కార్యదర్శి లక్‌పతినాయక్ పిలుపునిచ్చారు. తండాల అభివృద్ధి, గిరిజన సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని కోరారు. కడ్తాలలోని గిరిజన భవన్ వద్ద సోమవారం సేవాలాల్ సేన పదో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వి.నరేశ్‌నాయక్ అధ్యక్షతన వేడుక నిర్వహించారు. సేవాలాల్ సేన జెండాను లక్పతి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పోడుభూములకు పట్టాలివ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భీంలాల్ పవార్, హన్మనాయక్, బిక్యానాయక్, పత్యానాయక్, తులసీరామ్‌నాయక్, శంకర్, శ్రీను, భూనాథ్, పాండు, సేవ్య, వినోద్, భీమా, రాజు, బిక్కు, బాబూలాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి


టీచర్ల సన్మానిస్తున్న మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, నాయకులు

కొత్తూర్, సెప్టెంబరు 9: కొడిచర్ల ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసి పదోన్నతిపై వెళ్తున్న టీచర్ల సేవలు మరువలేనివని కొడిచర్ల మాజీ ఎంపీటీసీ బొంతల రవీందర్‌రెడ్డి అన్నారు. కొడిచర్ల, కొడిచర్లతండా, ఖాజీగూడతండా పాఠశాలల్లో పనిచేసిన శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, కరుణ వేరే పాఠశాలలకు బదిలీ కాగా, వారికి కొడిచర్లతండా పాఠశాలలో సోమవారం సన్మానాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీటీసీ మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, ఎక్కడికి వెళ్లినా మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో తండా మాజీ సర్పంచ్ సంతోష్‌నాయక్, బిచ్చనాయక్, గోపాల్‌నాయక్, శంకర్‌నాయక్, వెంకట్‌నాయక్, విష్ణునాయక్, దేవ్‌నాయక్, సోమ్లనాయక్, మోహన్‌నాయక్, నవీన్, శ్రీకాంత్, రామునాయక్, జ్యోతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

చేవెళ్ల: ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు తప్పవని గుండాల ప్యాక్స్ చైర్మన్ నక్క బుచ్చిరెడ్డి అన్నారు. గుండాలలోని జడ్పీ పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీ అయిన టీచర్లను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీలత, రమాదేవిలను సన్మానించారు. మాజీ సర్పంచ్ పుష్పకుమారిగణేశ్, యాదగిరి, టీచర్లు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనోత్సవం

చౌదరిగూడ, సెప్టెంబరు 9 : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జిల్లేడ్-చౌదరిగూడలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి లడ్డూ వేలాన్ని నిర్వహించి సోమవారం నిమజ్జనానికి తరలించారు. నిమజ్జన ర్యాలీలో నాయీ బ్రాహ్మణ సంఘం మహిళలు, చిన్నారులు ప్రత్యేక వస్త్రాలంకరణలో భక్తి పాటలకు కోలాట నృత్యాలు చేస్తూ, భజన పాటలు పాడుతూ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆంజనేయులు, యాదయ్య, నారాయణ, రమేష్, వీరేష్, సురేష్, రాజు, నరేష్, శ్రీకాంత్, రఘు, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


శోభాయాత్రలో నాయీ బ్రాహ్మణుల కోలాటం

గణపతులకు పూజలు


షాబాద్ గోల్డ్‌ఫేస్ కాలనీలో నెలకొల్పిన గణేశుడి పూజలో పాల్గొన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు


కడ్తాల్ : మైసిగండిలో పూజల్లో నాయకులు, భక్తులు, మహిళలు


కందుకూరు: గూడూరులో వినాయక మండపం వద్ద భక్తుల పూజలు


శంషాబాద్‌లోని వినాయక మండపంలో పూజల నిర్వహిస్తున్న భక్తులు


చేవెళ్ల: ముడిమ్యాల్ గ్రామంలో పూజలందుకుంటున్న వినాయకుడు

సంక్షిప్తంగా...

శంషాబాద్ రూరల్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్, మల్కారం పీఏసీఎస్ చైర్మన్ బుర్కుంట సతీశ్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బుర్కుంట బాబు, మహేశ్, బల్లెపు రాజు, జంగారాపు కొమ్ము గోపాల్, అంజనేయులుగౌడ్, దేవేందర్, విజయ్, రామకృష్ణ, రాజేశ్, పవన్, మెట్టు ప్రశాంత్, రఘు పాల్గొన్నారు.

● **ఆమనగల్లు :** వినాయక నిమజ్జన వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ రంగ స్వామి కోరారు. నిమజ్జనం సందర్భంగా ఉత్సవ కమిటీలు, భక్తులు, ప్రజలు తగిన ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని కోరారు. ఆమనగల్లు సురసముద్రం చెరువును సీఐ ప్రమోద్‌కుమార్, ఇరిగేషన్ శాఖ ఏఈ తిరుపతయ్య, మున్సిపల్ కమిషనర్ వసంతలతో కలిసి ఏసీపీ సందర్శించారు. నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. సంకటోనిపల్లి గేటు వైను నుంచి చెరువు కట్టపైకి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని ఎస్‌ఐ వెంకటేశ్‌కు సూచించారు. శాంతి సామరస్యం ఉన్నప్పుడే వ్యవస్థ బాగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు బాల్‌రెడ్డి, యాదయ్య, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

● **తలకొండపల్లి:** కల్వకుర్తి నుండి గట్టిప్పలపల్లి, రాంపూర్, చంద్రధన మీదుగా తలకొండపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలని రాంపూర్ గ్రామస్థులు ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ మేరకు కల్వకుర్తి ఆర్టీసీ డీఎం సుభాషిణిని కలిసి వినతి పత్రం అందజేశారు. బస్సు సౌకర్యం లేక కళాశాలలు, పాఠశాలలకు వెళ్లడానికి విద్యార్థులు, పనుల మీద వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా డీఎం సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో వెంకటయ్య, కృష్ణారెడ్డి, చిన్నమోహన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కాకి కృష్ణ, నర్సింహ్మారెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

● **తలకొండపల్లి:** చంద్రధనలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఉప్పల చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కామినేని ఆసుపత్రి సహకారంతో శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ అఖిల్ , అనిల్, కామినేని ఆసుపత్రి వైద్య సిబ్బంది శిబిరంలో 234 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ముందులు అందజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు రావని వైద్యులు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, సుధాకర్, రాములు, జంగయ్యగౌడ్, శేఖర్‌యాదవ్, యాదయ్య, చెన్నయ్య, రాజేందర్‌రెడ్డి, నర్సింహ, రామయ్య, అశోక్, బాలకిష్టయ్య, రాఘవాచారి,వెంకటేశ్, గణేశ్, అజయ్, మల్లేశ్, చందు పాల్గొన్నారు.

● **మొయినాబాద్ రూరల్:** విద్యార్థులు ఫిజియోథెరపీ చేయించుకోవడం ద్వారా మంచి ఆరోగ్య భవిష్యత్తు ఉంటుందని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తంరెడ్డి సూచించారు. హిమాయత్ నగర్‌లోని డీమ్డ్ యూనివర్సిటీలో వరల్డ్ ఫిజిథెరపీ డేలో భాగంగా ఆ విభాగానికి చెందిన విద్యార్థులు ఎకాటమీ, ఓపీడీ థీమ్, కోర్‌స్టెబిలిటీ, బ్యాక్ పెయిన్ ఎక్సర్‌సైజ్ తదితర 6స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీసీ పురుషోత్తంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్టాల్స్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపీ విభాగ విద్యార్థులు ఈ కార్యక్రమానికి పూనుకోవడం అభినందనీయమని అన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 9: ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో ఆదివారం రాత్రి ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతోనే అతడు ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పోచారానికి చెందిన బత్తుల నరేష్(28)కు భార్య మాధవి, రెండేళ్ల కుమారుడున్నారు. ప్రస్తుతం మాధవి గర్భిణి. ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన నరేష్ సోమవారం ఉదయం మంగల్‌పల్లి రోడ్డులో గల ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. ఓ రైతు చూసి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారమిచ్చాడు. నరేష్ తండ్రి కిష్టయ్య అనారోగ్యంతో రెండు నెలల క్రితమే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

మంద నుంచి మేకలు, గొర్రెల అపహరణ

యాచారం, సెప్టెంబరు 9: మంద నుంచి రూ.లక్ష విలువైన మేకలు, గొర్రెలను అపహరించిన ఘటన ఆదివారం చింతపట్లలో జరిగింది. వర్షం కారణంగా కాపరులు ఇంట్లో నిద్రించడంతో దొంగలకు జీవాలను ఎత్తుకపోయారు. చింతపట్లకు చెందిన గడ్డమీది శ్రీశైలం మంద నుంచి రెండు పొట్టేళ్లు, గుండ్ల రాములు మంద నుంచి ఒక మేకపోతు, కాకులారం యాదయ్య మందలో ఒక గొర్రె పొట్టేలు, నాలుగు మేకపోతులను దొంగలు అపహరించారు. వాటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని కాపరులు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.